మోగిన బడిగంట

జిల్లావ్యాప్తంగా తెరుచుకున్న స్కూళ్లు

- తొలిరోజు హాజరు అంతంతే..

కొత్తచెరువు, జూన్ 13: బడిగంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో జిల్లావ్యాప్తంగా గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. తొలిరోజు హాజరు అంతంత మాత్రంగానే కనిపించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 2.18 లక్షలకు పైగా విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. సగం మంది కూడా రాలేదు. 1.08 లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలు, విద్యాకిట్లను అందిస్తున్నామని ఆమె తెలిపారు. మొదటి రోజు కొన్ని పాఠశాలలకు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది.



కొత్తచెరువులోని పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



హిందూపురంలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు బెలూన్లు ఇచ్చి స్వాగతం పలుకుతున్న టీచర్లు

డైలీ ఫైనాన్స్!



పురంలో జోరుగా వడ్డీ వ్యాపారం

వాహనాలు, ఆస్తులు తాకట్టు పెట్టుకుని అప్పు

వందకు రూ.10 వరకు వడ్డీ వసూలు


చిరువ్యాపారులు విలవిల

పట్టించుకోని అధికారులు

హిందూపురం, జూన్ 13: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో తోపుడుబండిపై వ్యాపారం చేసే రోజువారీ ఫైనాన్స్‌కు రూ.10వేలు తీసుకున్నాడు. వ్యాపారి చేతికిచ్చింది రూ.7,500. వందరోజులు రూ.100 చొప్పున కట్టించుకున్నారు. బెంగళూరు రోడ్డులో తినుబండారాల వ్యాపారం చేసే వ్యక్తి రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఆయన కూడా రోజుకు రూ.1300 చొప్పున వంద రోజులు కట్టాలి. హిందూపురం పట్టణంలో పై ఇద్దరే కాదు.. ఇలాంటి చిరు వ్యాపారులు వందల్లో రోజువారీ వడ్డీకి డబ్బు తీసుకుని, వ్యాపారం చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులుపోను మిగిలింది వీరికి ఫైనాన్స్ కట్టడానికే సరిపోతోంది. ఉమ్మడి జిల్లాలోనే హిందూపురంలో వడ్డీ వ్యాపారం విపరీతంగా సాగుతోంది. సామాన్యులు అత్యవసరానికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పదు. వ్యాపారులు ఇష్టానుసారంగా వడ్డీలు గుంజుతున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు. మరికొందరు అధిక వడ్డీ చెల్లించలేక ఆస్తులు తెగనమ్ముకుంటున్నారు. ఇటువంటి సామాన్యులు, మధ్యతరగతికి చెందిన ప్రజల బలహీనతలు అక్రమ వడ్డీ వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. రెట్టింపు వడ్డీలు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. వీరి వలలో చిరువ్యాపారులు, ట్యాక్సీ ఆటోడ్రైవర్లు, యువకులు, విద్యార్థులు, కొంతమంది మహిళలు సైతం చిక్కుకుని విలవిల్లాడుతున్నారు.

వాహనాలు, ఆస్తులు తాకట్టు

వడ్డీకి ఇచ్చే వ్యాపారులు సెక్యూరిటీగా బైక్‌లు, కార్లు, విలువైన సెల్‌ఫోన్లు ఇతర ఆస్తుల డాక్యుమెంట్లు పెట్టుకుంటున్నారు. వీటితోపాటు ఇన్సూరెన్స్ బాండ్లు తమ వద్దే ఉంచుకుంటున్నారు. అధిక వడ్డీ వ్యాపారం కొందరి ప్రాణాలను సైతం బలి తీసుకుంటోంది. మరికొందరు కోట్ల ఆస్తులను కోల్పోతూ బజారున పడుతున్నారు. అవసరానికి ఎక్కడా డబ్బు లభించక ఎంత వడ్డీ అయినా చెల్లించడానికి సిద్ధమై అప్పుగా తీసుకున్నవారు వడ్డీ చెల్లించలేని తరుణంలో ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఇటీవల హిందూపురం మండలానికి చెందిన యువకుడు అధిక వడ్డీకి అప్పులు తీసుకుని, చెల్లించలేక రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మరికొంతమందైతే వడ్డీలు చెల్లించలేక సెక్యూరిటీగా పెట్టిన వాహనాలు, ఆస్తులు సైతం వదులుకుంటున్నారు. చిరు వ్యాపారులు రోజువారీగా తీసుకున్న వడ్డీ చెల్లించడానికి వారి సంపాదన సరిపోతుండటంతో వారి బతుకులు చితికిపోతున్నాయి.



జోరుగా వ్యాపారం

వైసీపీ అధికారంలోకి వచ్చాక హిందూపురంలో వడ్డీ వ్యాపారం విపరీతంగా పెరిగింది. చాలా మంది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు రోజువారీ కూలికి వెళ్లేవారికి పనులు దొరక్క వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భవన నిర్మాణానికి చెందినవారు అధికంగా ఉన్నారు. హిందూపురంలో వడ్డీ వ్యాపారుల చేతిలో చిక్కుకున్నవారు అధిక శాతం రోజువారీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. నెలకు కనీసం పురంలో రూ.10 నుంచి రూ.20 కోట్ల వరకు వడ్డీ వ్యాపారం సాగుతున్నట్లు అంచనా.

వడ్డీ వ్యాపారులు అకృత్యాలు మితిమీరిపోయాయి. అప్పులు, వడ్డీలు చెల్లించలేని పక్షంలో వారు సెక్యూరిటీగా పెట్టిన ఆస్తులు వడ్డీ జలగలు స్వాధీనం చేసుకుంటున్నాయి. ఇంకా చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నట్లు బాధిత వర్గాలు వాపోతున్నాయి. కట్టకపోతే భూములు సైతం ఆక్రమించుకుంటున్నారు. అప్పుల ముసుగులో వడ్డీ దోపిడీ సాగుతున్నా బాధితులు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. ఎందుకంటే అప్పులు ఇచ్చేవారు ముందుకురారని భయపడుతున్నారు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం జరుగుతున్నా ఈ దోపిడీని అరికట్టాల్సిన చిట్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులుకానీ, పోలీసులు కానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు.. ఈ అక్రమ దందాపై దృష్టి సారించి, సామాన్యుల నడ్డి విరుస్తున్న వడ్డీ దందాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వడ్డీ వ్యాపారులు సెక్యూరిటీగా ఇల్లు, భూములు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఆస్తులు, విలువైన వస్తువులను పెట్టుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అప్పు తీసుకునే సమయంలో వారి ఏటీఎం, పాన్‌కార్డులను వడ్డీ వ్యాపారులు లాగేసుకుంటున్నారు. వేతనం బ్యాంకు ఖాతాలో జమకాగానే డ్రా చేసుకుంటున్నారు. వడ్డీ వసూలుకు సంబంధించిన ఖర్చులు కూడా అప్పు తీసుకున్నవారి నుంచే పిండుకుంటున్నారు. వాయిదా ప్రకారం వడ్డీ, అప్పు చెల్లించని వారి ఇంటికి మనుషులను పంపుతూ

రికవరీ ఖర్చులూ కట్టాల్సిందే..

వారి ఖర్చులు కూడా అప్పు తీసుకున్న వారి నుంచే వసూలు చేస్తున్నారు. ఒకసారి లోన్ రికవరీకి వెళ్తే రూ.వెయ్యి అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారులు ఈ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. మరీ ముఖ్యంగా అప్పు వసూళ్లకు కొంతమంది ఏజెంట్లను నియమించుకుని, వారిని ఇళ్ల వద్దకు ఉదయమే పంపించి, డబ్బు రాబట్టే పనిలో ఉంటున్నారు. అప్పు తీసుకున్నవారు ఇంటివద్ద లేకపోతే వారు ఎక్కడున్నారో తెలుసుకుని, అవసరమైతే బెదిరింపులకు పాల్పడుతూ పది మంది మధ్యలో ఉన్నపుడు వారిని ఒత్తిడి చేస్తూ బలవంతంగా వసూలు చేస్తున్నారు.





మడుగు కాదు.. రోడ్డే..

రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై వైసీపీ పాలకులు చూపిన నిర్లక్ష్యానికి నిదర్శనం ఈ రోడ్డు. నంబులపూలకుంట నుంచి సోలార్ ప్లాంట్‌కు వెళ్లే రోడ్డు ఇది. అడుగుకో గుంత ఏర్పడింది. వైసీపీ పాలకులు మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి గొయ్యిలా మారిపోయాయి. గురువారం భారీ వర్షం కురిసింది. వర్షపు నీరు గుంతల్లో చేరడంతో అవి మడుగులను తలపిస్తున్నాయి. ఆ రోడ్డులో వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రయాణించాల్సి వచ్చింది. గుంతల్లో రాళ్లు ఉండడంతో ద్విచక్రవాహనాలు నిలిచిపోయాయి. ఇతరుల సాయంతో వాహనాలను బయతకు తీసుకోవాల్సి వచ్చింది. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలనీ, కనీసం గుంతలైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

-నంబులపూలకుంట



గుడిబండలో కురుస్తున్న వర్షం

జిల్లాలో మోస్తరు వర్షం

పుట్టపర్తిరూరల్, జూన్ 13: జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ధర్మవరంలో 29.4 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కదిరి 20.2, కనగానపల్లి 18.6, బత్తలపల్లి 18.6, తాడిమర్రి 18.4, నల్లచెరువు 15.4, రామగిరి 14.8, ఓబుళదేవరచెరువు 10.4, ముదిగుబ్బ 8.6, తలుపుల 8.4, గాండ్లపెంట 7.2, బుక్కపట్నం 7.2, నంబులపూలకుంట 6.4, నల్లమాడ 6.4, చెన్నేకొత్తపల్లి 5.6, తలుపులలో 5.6 మి.మీ, వర్షం కురిసినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

సంతకం.. సంబరం..



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు, టీడీపీ నాయకులు

డీఎస్సీ విడుదలపై చంద్రబాబు సంతకంతో నిరుద్యోగుల ఆనందం

పెనుకొండ టౌన్, జూన్ 13: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే తొలిసంతకం మెగా డీఎస్సీ విడుదలపై సంతకం పెట్టారు. దీంతో డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సంబరాలు చేసుకున్నారు. పెనుకొండలోని ఎన్టీఆర్ విగ్రహానికి నిరుద్యోగులు, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అక్కడే చంద్రబాబు చిత్రపటం ఏర్పాటుచేసి, క్షీరాభిషేకం చేశారు. నిరుద్యోగులు మాట్లాడుతూ.. సంపద సృష్టించడం, యువతకు భరోసా కల్పించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు సుబ్రహ్మణ్యం, రఘువీరాచౌదరి, రామలింగ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యం

జిల్లా వైద్యాధికారి మంజువాణి

హిందూపురం అర్బన్, జూన్ 13: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమని జిల్లా వైద్యాధికారి మంజువాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి వ్యాధి స్ర్కీనింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి కారణంగా క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. క్యాన్సర్ లక్షణాలు బయటకు కనబడవన్నారు. అవగాహనతోనే గుర్తించగలమన్నారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు.. సర్వే చేసి వ్యాధిగ్రస్థులను గుర్తించాలన్నారు. బాధితులను మెరుగైన ఆస్పత్రులకు తీసుకెళ్లి, వారి ప్రాణాలను కావాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నీరజ, విజయాబాబు, అయిషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

నయనమనోహరం



పుట్టపర్తి, జూన్ 13: స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో గురువారం హర్యానా రాష్ట్రానికి చెందిన సత్యసాయి విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు నయనమనోహరంగా సాగాయి. సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు. హిస్సార్‌కు చెందిన సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థినులు హరితుమ్ హానా హర్యానా పేరిట నృత్యాన్ని ప్రదర్శించారు. హర్యానా సంప్రదాయ నృత్యంతో భక్తులను మైమరపింపజేశారు. మహిశాసురమర్ధిని నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. సాయిభక్తి పాటలను ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



చంద్రబాబుపైనే.. ఆశలు



పుట్లూరులోని ఆర్బీకే

- నాడు టీడీపీ హయాంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓల నియామకం
- వైసీపీ పాలనలో వారి జీవితాలతో చెలగాటం
- జనాభా ప్రాతిపదికన ఆర్బీకేల ఏర్పాటుతో అన్యాయం
- ఓడీపై చిత్తూరు జిల్లాకు 205 మంది..
- 50 మంది తొలగింపు
- ఇప్పుడైనా న్యాయం చేకూరేనా..?

అనంతపురం అర్బన్, జూన్ 13: వ్యవసాయ శాఖలో ఎంపీఈఓల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను అమలు చేసింది. దీంతో అప్పటి దాకా వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 సంవత్సరంలో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్)ను కాంట్రాక్టు పద్ధతిలో, 1000 హెక్టార్లకు ఒకరి చొప్పున నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరపున క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వచ్చారు. తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ ఈ క్రాపింగ్, పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు వివరించడం వీరి ప్రధానమైన కర్తవ్యం. వైసీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్థక శాఖ తరపున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు గడ్డుకాలం మొదలయ్యింది. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, సీఎంగా చంద్రబాబునాయుడు కావడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఎంపీఈఓలు ఉన్నారు.

ఆర్బీకేల ఏర్పాటుతో అన్యాయం

జిల్లాలో జనాభా ప్రాతిపదికగా ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. రెండువేల మంది జనాభాకు ఒక ఆర్బీకే సిబ్బందిని నియమించారు. జిల్లాలో ఖరీఫ్, రబీ సాగు విస్తీర్ణం ఎక్కువే. అనంత జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరంగా 9.31 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ పరంగా 1.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ రెండు శాఖల తరపున మొత్తం 10.53 లక్షల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యి హెక్టార్లకు (2500 ఎకరాలు) ఒక ఎంపీఈఓ చొప్పున నియమించారు. అనంతలో 455, సత్యసాయిలో 416 రైతు భరోసా కేంద్రాలున్నాయి. గతంలో ఒక ఎంపీఈఓకు 2500 ఎకరాల పరిధి ఉండేది. ఆర్బీకే ఏర్పాటైన తర్వాత జనాభాను పరిగణలోకి తీసుకోవడంతో ఎంపీఈఓకు తీరని అన్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం వింత నిర్ణయాలతో ఎంపీఈఓలు తమ ఉద్యోగాలకు దూరం కావాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మరోవైపు జనాభా ప్రాతిపదికగా ఆర్బీకేలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడంతో పనిభారం ఎక్కువై సతమతమవుతున్నారు. జిల్లాలోని కొన్ని ఆర్బీకేల పరిధిలో 4వేల నుంచి 10 వేల ఎకరాల విస్తీర్ణంలో పంట పొలాలున్నట్లు సమాచారం. ఆయా ఆర్బీకేల పరిధిల్లో సిబ్బంది ఈ క్రాపింగ్‌తోపాటు ఫీల్డ్ వెరిఫికేషన్, ఈకేవైసీ, వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, శాఖాపరంగా ఇతర రకాల పనులు చేస్తూ అధిక పనిభారంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చిత్తూరు జిల్లాలో కేవలం 120 ఎకరాల నుంచి 300 ఎకరాలకు ఒక ఆర్బీకేని ఏర్పాటు చేయడం గమనార్హం. ఆ జిల్లాలో 2వేల మంది జనాభాకు ఒక ఆర్బీకే ఏర్పాటు చేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. చిత్తూరులో జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోకపోగా.. అనంతలో పనిచేసే ఎంపీఈఓలను బలిపశువులను చేసి ఓడీపై అక్కడ పనిచేయిస్తూ ఇబ్బందులకు గురిచేయడం దారుణం.

ఓడీపై 205 మంది చిత్తూరుకు..

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏలుగా ఎంపికయ్యారు. మిగతా 475 మంది ఎంపీఈఓలు అలాగే మిగిలిపోయారు. జనాభా ప్రాతి పదికన పోస్టులు కేటాయించడంతో, ఇక్కడ ఖాళీ లేవన్న కారణంతో 2020 సంవత్సరంలో 205 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 107 మంది ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్నారు. మిగిలిన వారిలో అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలతో ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేయలేక తిరిగి వచ్చారు. మరికొందరు ఓడీపై వెళ్లలేక మిన్నకుండిపోయారు. మరికొందరికి చిత్తూరుకు ఓడీపై బదిలీ ఉత్తర్వులు ఇవ్వకుండానే పక్కనపెట్టారు. సదరు సిబ్బంది అప్పట్లో సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదు. ఇలా అనంత జిల్లాలో 50 మంది, సత్యసాయిలో 48 మంది ఎంపీఈఓలు నాట్ వర్కింగ్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలు రూ.12వేల వేతనం కోసం తప్పని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతూనే అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమకు తిరిగి జిల్లాలోనే పోస్టింగ్‌లు ఇచ్చి ఆదుకోవాలని బాధిత ఎంపీఈఓలు కోరుతున్నారు.

50 మంది ఎంపీఈఓలు ఔట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై వెళ్లలేదన్న కారణంతో 50 మంది ఎంపీఈఓలను జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఇటీవల ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించింది. ఓడీపై చిత్తూరు జిల్లాకు ఎంపీఈఓలను పంపాలని నిర్ణయించిన నాటి నుంచి ఎంపీఈఓల సంఘం నాయకులు ఓడీపై చిత్తూరు జిల్లాకు సిబ్బందిని పంపకుండా జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలని వైసీపీ పాలకులు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు అనేక మార్లు కోరుతూ వచ్చారు. జిల్లాలో 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవిస్తూ వచ్చారు. ఎంపీఈఓల సంఘం విన్నపం మేరకు సిబ్బంది ఇబ్బందులను గుర్తించిన వ్యవసాయ కమిషనర్ 2023 ఆఖరులో 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించేలా ఫైల్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది. ఎన్నికల కారణంగా ఆగిపోయిన ప్రక్రియ, ఇప్పుడైనా కదిలేనా అని ఎంపీఈఓలు మళ్లీ ఆశాభావంతో ఉన్నారు. ఎక్కడా లేని విధంగా జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు ఓడీపై చిత్తూరుకు వెళ్లని 50 మంది ఎంపీఈఓలను ఉద్యోగం నుంచి తొలగించడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అనంత రూరల్ మండలంలో పనిచేసే ఓ మహిళా సిబ్బంది అనారోగ్యంతో సెలవులో ఉండగా.. ఓడీపై వెళ్లని సిబ్బందితోపాటు ఆమెకు టర్మినెట్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఇలా పలు కారణాలతో సెలవులో ఉన్నా వారిపై ఏ మాత్రం జాలి లేకుండా తొలగించారు. రాష్ట్రంలో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో వారి ఉద్యోగాలపై ఆశలు చిగురిస్తున్నాయి.

1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించాలి

: నాగరాజు, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

టీడీపీ హయాంలో ఎంపీఈఓలుగా ఉద్యోగ అవకాశం కల్పించారు. వైసీపీ అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి మాకు తీరని అన్యాయం చేశారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి మా కడుపు కొట్టారు. జిల్లా నుంచి ఓడీపై ఉమ్మడి చిత్తూరుకు బదిలీ చేసిన ఎంపీఈఓలందరినీ తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలి. తొలగించిన 50మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. జిల్లాలో ప్రతి 1500 ఎకరాల విస్తీర్ణానికి ఒక ఎంపీఈఓను నియమిస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. వైసీసీ నేతలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి మాకు న్యాయం చేయాలని కోరుతాం. టీడీపీ ప్రజా ప్రతినిధుల దృష్టికి మా ఆవేదనను తీసుకెళతాం.



అనంతలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాలి

: రెడ్డి ప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు

అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన 98 మంది ఎంపీఈఓలు ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా మహిళా సిబ్బంది ఉన్నారు. ఆర్బీకే సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇవ్వడం సరైంది కాదు. ఇప్పటికైనా ఉమ్మడి చిత్తూరులో పని చేసే ఎంపీఈఓలకు తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇప్పించేలా ప్రత్యేక చర్య లు తీసుకోవాలి. టర్మినేట్ చేసిన ఎంపీఈఓలకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలి.





చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకులు


మెగా డీఎస్సీపై సీఎం తొలి సంతకం

తెలుగు యువత సంబరాలు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం అర్బన్, జూన్ 13: ఎన్నికల హామీ మేరకు మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంపై తెలుగు యువత నాయకులు సంబరాలు చేశారు. గురువారం స్థానిక రఘువీరాకాంప్లెక్స్ వద్ద తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడుపూటి నారాయణస్వామి డీఎస్సీ అభ్యర్థులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీని వైసీపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులను జగన్ నట్టేట ముంచాడన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి నిరుద్యోగులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టడం శుభపరిణామన్నారు. నిరుద్యోగులు చంద్రబాబు నిర్ణయంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మద్దినేని కృష్ణ, కృష్ణగోపాల్, వెంకట్, రంగంపేట బాలు, రాజేంద్ర, గణేష్, నరసింహులు, తిరుమలేష్, నాగేంద్ర, రమేష్, చక్రి, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుపై వృద్ధులు..



కేక్ కట్ చేస్తున్న వృద్ధులు

అనంతపురం కల్చరల్: సామాజిక పింఛన్ల పెంపును హర్షిస్తూ గురువారం వైశ్యా హాస్టల్ కాంపౌండ్‌లోని వృద్ధాశ్రమంలో సంబరాలు చేసుకున్నారు. మాజీ కార్పొరేటర్ క్రిష్టం ప్రసన్న లక్ష్మీ, క్రిష్టం రఘు, ఆరవేటి శ్రీధర్ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులు కేక్ కట్‌చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు క్రిష్టం రఘు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా పింఛన్ల పెంపుపై చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఒక్కొక్క నెలకు రూ.వెయ్యి చొప్పున 3వేలు, జూలైలో రూ.4వేలు పింఛన్‌తో కలుపుకుని మొత్తం రూ.7వేలు అందజేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులు జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, క్రిష్టయ్య, రమణయ్య, శ్రీరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

నల్లమాడ, జూన్ 13: మండలంలోని కుటాలపల్లి గ్రామానికి చెందిన ఎనిమిదిమంది గురువారం తేనేటీగల దాడిలో గాయపడ్డారు. మొక్కజొన్న పంటకు మందులు పెడుతుండగా తేనేటీగలు దాడిచేశాయి. దాడిలో ఎనిమిదిమంది గాయపడగా వారిని చికిత్సనిమిత్తం నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇప్పుడైనా ఇస్తారా..?

పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూపు

నీరు-చెట్టు, ఎస్‌డీఎఫ్ డబ్బు వచ్చేనా...?

వైసీపీ కక్ష సాధింపుతో చితికిపోయిన టీడీపీ శ్రేణులు

సీఎం చంద్రబాబు కనికరించాలంటున్న కాంట్రాక్టర్లు

బుక్కరాయసముద్రం, జూన్ 13: వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించ కుండా వేధించింది. దీనిపై స్పందించిన చంద్రబాబునాయుడు తమ పార్టీ అధికారంలోకి రాగానే ఆ బిల్లులన్నింటిని వడ్డీతో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఆర్థికంగా చితికిపోయిన తమకు ఇప్పుడైనా నాడు చేసిన పనులకు బిల్లులు మంజూరు అవుతాయా అని టీడీపీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. శింగనమల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి నీరు- చెట్టు, సీసీరోడ్లు, కాలువలు వంటి పనులు చేశారు. ఈ పనులను టీడీపీ వారు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు చేసిన వారు ఆర్థికంగా చితికిపోయారు. హైకోర్టు ఆదేశించినా ఈ నియోజకవర్గంలో మాత్రం 80 శాతం పనులకు డబ్బులు ఇవ్వలేదు. కొంత మందికే మాత్రమే బిల్లుల మంజూరు చేశారు.

ఆన్‌లైన్‌లో నీరు-చెట్టు పనుల తొలగింపు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు- చెట్టు పథకం కింద ఇరిగేషన్ శాఖ పరిధిలో చెరువులు, నీటి కాలువలలో పూడికి తీత, హెచ్చెల్సీ ఆయకట్టు అభివృద్ధి పనులు, చెక్‌డ్యాంలు పునరుద్ధరణ, కొత్త చెక్‌డ్యామ్‌లు నిర్మాణం వంటి పనులను చేపట్టారు. 2017 నుంచి 2018 వరకు నియోజకవర్గంలో 352 పనులను చేపట్టారు. ఈ పనులను అప్పట్లో నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, డైరెక్టర్లు సభ్యులు చేపట్టారు. ఈ పనులకు రూ.10 కోట్లపైగా వెచ్చించారు. పూర్తిచేసిన పనులను అప్పట్లో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, తనిఖీ చేసి ఎం.బుక్‌లో నమోదు చేసిన అనంతరం బిల్లు క్లియరెన్స్ కోసం సీఎఫ్ఎంఎస్ అప్‌లోడ్ చేశారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు నీరు -చెట్టు పనుల బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. చివరికి చేసిన పనులను ప్రభుత్వ రికార్డులల్లోనే లేకుండా ఇరిగేషన్ అధికారులు తొలిగించారు. ప్రస్తుతం నాడు చేసిన పనులుకు ఎంబుక్‌ల ఆధారంగా బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఎస్‌డీఎఫ్ బిల్లులోనూ కక్ష సాధింపు

టీడీపీ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్డు పనులను చేపట్టారు. చేసిన పనుల్లో నాణ్యత లేదనే సాకుతో వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల్లో దాదాపు 260 సిమెంటు రోడ్లు వేశారు. వాటికి అప్పట్లో రూ.11 కోట్లకుపైగా బిల్లులు రాకుండా వైసీపీ అడ్డుకుంది. దీంతో టీడీపీ సానుభూతిపరులు నష్టపోయారు.

20శాతం కోతతో బిల్లుల మంజూరు

టీడీపీ హయాంలో చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొంత మంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో చేసిన పనిలో 20శాతం కోత విధించి ప్రభుత్వం బిల్లులను ఇచ్చింది. దీంతో పని చేసిన కాంట్రాక్టర్‌కు సరైన సమయంలో డబ్బు రాకపోవడంతో పాటు వడ్డీని కూడా నష్టపోయినట్లైంది. పైగా 20శాతం కోత విధించడంతో కాంట్రాక్టర్‌కు తీవ్రనష్టం వాటిల్లింది. వీటితోపాటు 2014-17 వరకు చేపట్టిన ప్రభుత్వ పనులుకు సంబంధించి ప్రతి పనిలో 5 శాతం డిపాజిట్లు పట్టుకున్నారు. పని చేసిన అనంతరం రెండు సంవత్సరాలలో పనిలో నాణ్యత లోపిస్తే.. డిపాజిట్లులోని నగదును మరమ్మతులకు ఉపయోగిస్తారు. 5 శాతం డిపాజిట్లు సొమ్మును ఇవ్వాలని పంచాయతీ రాజ్ అధికారులను కాంట్రాక్టర్లు అడిగితే... డిపాజిట్లు సొమ్ములేదని, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసిందని సమాధానం చేబుతున్నారన్నారు.

ఆర్థికంగా చితికిపోయాం..



ఆరేళ్ల కిందట బుక్కరాయముద్రంలోని దేవరకొండ దేవాలయంపైకి సిమెంట్ రోడ్డు పనులు చేపట్టాం. కోటికిపైగా ఖర్చు చేసి, 50 శాతంపైగా పనులు చేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేసే పనిని దౌర్జన్యంగా నిలబెట్టించారు. చేసిన పనికి బిల్లులు చెల్లించకుండానే, చేసిన వర్క్‌ను తిరిగి వైసీపీ నేతలు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. చేసిన పనికి ఇప్పటి వరకు బిల్లులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు. దాదాపు కోటి రూపాయలు అప్పు చేసి పనులు చేయడంతో వడ్డీలు కట్ట లేక భూమిని అమ్మి అప్పులు కట్టా.

-లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్, బీకేఎస్

బిల్లులు వెంటనే ఇవ్వాలి..



గ్రామాల్లో పోటీ పడి సిమెంట్ రోడ్లు, నీరు చెట్టు పనులు చేపట్టాం. గత ఐదేళ్లుగా బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. ప్రస్తుతం ఆర్థికంగా చితికి పోయా. రూ.35 లక్షల మేరకు బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు కనికరించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నాం. ఇన్నాళ్లు ఎంతగానో ఎదురు చూశాం. టీడీపీ పాలనలో కూడా బిల్లులు రాకపోతే... ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం.

- నారాయణస్వామి, మాజీ సర్పంచ్, చెదల్ల గ్రామం

ఏడీసీసీ బ్యాంకు సీఈఓగా సురేఖారాణి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వందేళ్ల చరిత్రలో మొట్ట మొదటి మహిళా సీఈఓగా సురేఖారాణి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో ఏడీసీసీ బ్యాంకు రెగ్యులర్ సీఈఓగా సురేఖారాణి బాధ్యతలు స్వీకరించారు. అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో సీఈఓ ఏబీ రాంప్రసాద్ రాజీనామా చేశారు. దీంతో ఏడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్‌గా ఉన్న సురేఖారాణికి సీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఈఓ ఏబీరాంప్రసాద్ రాజీనామాపత్రాన్ని ప్రభుత్వం ఆమోదిస్తూ జీఎం సురేఖారాణిని రెగ్యులర్‌గా నియమిస్తూ ఆప్కాబ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సురేఖారాణి మాట్లాడుతూ... ఉద్యోగులు సమష్టిగా పనిచేసి 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన సురేఖారాణికి బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.



సీఈఓను అభినందిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

30 తులాల బంగారం చోరీ

అనంతపురం క్రైం, జూన్ 13: నగరంలో పట్టపగలే 30 తులాల బంగారు నగలు, రూ. 37,500 చోరీ అయ్యాయి. నగరంలోని భవానీనగర్‌లో నివాసముంటున్న చంద్రమోహన్‌రెడ్డి దంపతులు కమలానగర్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం దుకాణానికి వెళ్లినవారు మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటం చూసి అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. లాకర్‌లో ఉండాల్సిన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.37,500 నగదు కనిపించలేదు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

4 నెలలు.. ఎన్నో అద్భుతాలు..



చిన్నారిని, తల్లిదండ్రులను అభినందిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 13: నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి క్రిష్టినా సియారా పేరు నమోదుకావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టరు వినోద్‌కుమార్ కొనియాడారు. గుంతకల్లు పట్టణానికి చెందిన రైల్వే ఉద్యోగి సుధాకర్, సింధు దంపతుల నాలుగు నెలలచిన్నారి క్రిష్టినా సియారా. ఫ్లాష్‌కార్డు (ఆల్ఫాబిట్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్)ను అతిచిన్న వయసులో గుర్తించడంతో ఆ చిన్నారి పేరు నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆ చిన్నారితో తల్లిదండ్రులు.. కలెక్టరును కలిశారు. ఆ చిన్నారిని కలెక్టరు అభినందించి, ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

దరఖాస్తు చేసుకోండి..

పుట్టపర్తి రూరల్, జూన్ 13: వెంకటగిరి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కోర్సు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖాధికారి రమేష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 10వతరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐలో పాసైన విద్యార్థులకు నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారన్నారు. వయసు 15-23 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయోపరిమితి 25 సంవత్సరాలన్నారు. మొదటి సంవత్సరంలో రూ.1100, రెండో సంవత్సరంలో రూ.1200 స్టైఫండ్ ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. 08625-295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

ధర్మవరం, జూన్ 13: వైసీపీ ప్రభుత్వం అమలు పరచిన ల్యాండ్‌టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ నూతన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సంతకం చేయడం హర్షణీయమని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్‌టైటిలింగ్ చట్టం రద్దు కోరుతూ చేసిన ఉద్యమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ చురుకైన పాత్రపోషించిందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి న్యాయ పోరాటం కూడా చేశామన్నారు. ప్రజల ఆస్తి హక్కును హరించే ఈ చట్టాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వెంటనే రద్దు చేయడం హర్షణీయమన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేస్తూ బిల్లును ప్రవేశపెట్టి వెంటనే ఆమోదింపచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్మెల్యే కందికుంట ఆర్థికసాయం

నల్లచెరువు, జూన్ 13: మండలంలోని కె. పూలకుంట గ్రామంలో ప్రమాద వశాత్తు జీ. రాము అనే వ్యక్తి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ఆయన కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. ఆ నగదును టీడీపీ మండల కన్వీనర్ పీ.రాజ శేఖర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నాయకులు అంజనప్ప, వాసు, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కందులు

నల్లమాడ, జూన్ 13: ఖరీఫ్‌లో కంది సాగుచేసే రైతులకు మండలవ్యాప్తంగా ఉన్న ఆర్బీకేలలో విత్తన కందులు అందుబాటులో ఉన్నట్లు ఏఓ సుమతి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. 4కేజీల కందుల బ్యాగును సబ్సిడీతో రూ.391.44కి అందిస్తున్నామన్నారు. అవసరమున్న రైతులు ఆర్బీకేలలో తీసుకోవాలని సూచించారు.

ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హరీష్

కదిరిఅర్బన్, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏపీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొత్తకోట హరీష్ నియమితులయ్యారు. అనంతపురంలో బుధవారం జరిగిన ఏపీఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా బండి శివను నియమించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర నుంచి ఈ మేరకు నియామక పత్రం అందుకున్నట్లు హరీష్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి: ఎస్పీ



పట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ముదిగుబ్బ, జూన్13: గ్రామాల్లో గొడవలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చూడాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ముదిగుబ్బ అప్‌గ్రేడ్, పట్నం పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ లాకప్ గదులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై సమీక్షించారు. రికార్డులను పరిశీలించి కేసు వివరాలపై స్థానిక ఎస్‌ఐలను ఆరా తీశారు. గ్రామాల్లో ప్రశాంతత లోపించకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి సారించి, వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళలలో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ సీఐ యతీంద్ర, పట్నం ఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ పైపులైన్ తొలగించాలని వినతి

గాండ్లపెంట, జూన్ 13: మండలంలోని గాజులవారిపల్లి తండా పంచాయతీలోని కల్లుబాయితండాకు చెందిన ఆంజనేయులునాయక్ తన తోటకు పంచాయతీ బోరు నుంచి అక్రమంగా పైప్‌లైన్ వేసుకున్నాడని, వెంటనే తొలగించాలని ఆ తండా వాసులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సీనియర్ అసిస్టెంట్ అమీర్‌బాషాను కలిసి వినతి పత్రం అందించారు. ఆంజనేయులునాయక్ తన తోటకు పంచాయతీబోరు నుంచి పైపులైన్ వేసుకోవడంతో తమకు తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. కనుక వెంటనే అక్రమ కనెక్షన్ తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో రవినాయక్, రామస్వామినాయక్, లోకేష్, రమాదేవి, హేమల్లానాయక్, రమణనాయక్ పాల్గొన్నారు.

ఓటీ టెక్నీషియన్ వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

కొత్తచెరువు,జూన్ 13: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న ఓటీ టెక్నీషియన్ తనను వేధిస్తున్నాడంటూ నర్స్‌ట్రైనింగ్ విద్యార్థిని వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఓటీ టెక్నీషియన్ తన కోరిక తీర్చాలంటూ పలు దఫాలుగా వెంటబడి వేధిస్తున్నాడని ఆ విద్యార్థినిని ఈనెల 11వ తేదీన వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై గురువారం వైద్యాధికారి అశ్వర్థకుమార్‌ను వివరణ కోరగా ట్రైనీ విద్యార్థిని ఓటీ టెక్నీషియన్‌పై ఫిర్యాదు చేయడం వాస్తవమన్నారు. ఫిర్యాదు మేరకు టెక్నీషియన్‌ను మందలించామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఈద్గాను పరిశీలించిన ఎమ్మెల్యే

కదిరి, జూన్ 13: బక్రీద్ నేపథ్యంలో పట్టణంలోని ఈద్గాను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పండుగకు ఈద్గాలో తీసుకోవాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పారిశుధ్యం.. అధ్వానం



వాసవీనగర్‌లో మురుగుగా మారిన చెత్త



రైల్వేగేట్ కొట్టాల సమీపంలో పేరుకుపోయిన చెత్త

- ముదిగుబ్బలోని పలు వీధుల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన చెత్త
- వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

ముదిగుబ్బ, జూన్13: మండల కేంద్రంలోని పలు వీధుల్లో పారిశుధ్యం పడకేసింది. ముఖ్యంగా చెత్త ఎక్కడపడితే అక్కడ గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా వాసవీనగర్, రైల్వేగేట్ కొట్టాల, దొరిగల్లు రోడ్డు, వాసవీ కల్యాణ మండపం పరిసరాలు, ఆర్డీటీ కార్యాలయం ఎదుట తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్త పెద్దఎత్తున పేరుకుపోయింది. దీనివల్ల పందులు, కుక్కల స్వైర విహారం అధికంగా ఉందని, చెత్త ముగిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, ఆ కంపు భరించలేకున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో దోమలు విజృంభిస్తున్నాయని, ఫలితంగా జ్వరాల భారిన పడుతున్నామని అంటున్నారు. విషయం తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్ల పక్కన చెత్తను తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓఆర్డీ కృష్ణకుమార్‌ను వివరణ కోరగా చెత్త నిల్వ ఉన్న పరిసరాలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



ఆర్డీటీ కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన..

దుర్గంధాన్ని భరించలేకున్నాం..



తమ వీధిలో చెత్త పెద్దఎత్తున పేరుకుపోయి మురుగుగా తయారైంది. వాటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకున్నాం. దీనికి తోడు పందులు స్వైర విహారం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి.

-అనిల్‌కుమార్, వాసవీనగర్ , ముదిగుబ్బ

సమస్య వెంటనే పరిష్కరించాలి



రైల్వేగేట్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలి, అలాగే బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

- దాదావలి, ముదిగుబ్బ

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

- రేగాటిపల్లిలో టీడీపీ శ్రేణుల సంబరాలు

ధర్మవరంరూరల్, జూన్13: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే మెగాడీఎస్సీ, రూ. 4వేలకు పింఛన్ పెంపు, ల్యాండ్ టైటిలింగ్‌యాక్టు రద్దు, అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం, స్కిల్‌సెన్సస్‌పై సంతకాలు చేశారని టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు రేగాటిపల్లి భోగే నాగేంద్రరెడ్డి తెలిపారు. ఈ మేరకు మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో గురువారం టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో గ్రామ సచివాలయం ఎదుట కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డి, కొండారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బిల్లేరమేష్, బాబురెడ్డి, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.



రేగాటిపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పట్టణంలోని 33వ వార్డులో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, 33వ వార్డు అధ్యక్షుడు గోసలశ్రీరాములు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ధర్మవరం నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రగౌడ్, దుర్గాప్రసాద్,దామోదర్‌నాయుడు, హరి, మహేంద్ర పాల్గొన్నారు.

అరకొరగా పాఠ్యపుస్తకాలు

తాడిమర్రి, జూన్ 13: పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం అయ్యాయి. కాగా మండలకేంద్రంలోని ఎమ్మార్సీకి అరకొరగా పాఠ్యపుస్తకాలు చేరాయి. మండల వ్యాప్తంగా 36 పాఠశాలలకు గాను 1756 మంది విద్యార్థులున్నారు. వారికి 16,550 పాఠ్యపుస్తకాలు కావాల్సి ఉండగా.. ఇప్పటికి 12,450 పాఠ్యపుస్తకాలు మాత్రమే వచ్చాయి. దీంతో మిగిలిన విద్యార్థులకు ఎప్పుడు వస్తాయన్న అనుమానం విద్యార్థుల తల్లిదండ్రులలో వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టిన తరువాత పాఠ్యపుస్తకాలు చేరుతాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా పాఠశాలలు ప్రారంభమైన పది రోజుల్లోగా పుస్తకాలు వస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.



తాడిమర్రి ఎమ్మార్సీకి చేరినపాఠ్యపుస్తకాలు

సవితకు మంత్రివర్గంలో చోటుపై హర్షం

బుక్కపట్నం, జూన్ 13: రాష్ట్ర మంత్రివర్గంలో కురబ సామాజికవర్గానికి చెందిన పెనుకొండ ఎమ్మెల్యే సవితకు చోటు కల్పించడంపై జిల్లాలోని కురబ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో గురువారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడా రు. టీడీపీతోనే బడు గు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమన్నారు. సవితతో పాటు జిల్లాకు చెందిన మరో బీసీ ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ, కమ్మన్న, పార్థసారథి, సూరి, కాటమయ్య, ఈశ్వరయ్య నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దామావాండ్లపల్లిలో తాగునీటి ఎద్దడి



మరమ్మతుకు నోచుకోని చేతిపంపు





వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్న వైనం

నల్లచెరువు, జూన్ 13: మండలంలోని దామావాండ్లపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలఉంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, తాగునీటి పథకం బోరులో నీరు సమృద్ధిగా ఉన్నాయని, అయితే బోరుమోటారుకు విద్యుత్ సరిగా సరఫరా కావడం లేదని, దీనివల్ల నీరు రావడం లేదని గ్రామస్థులు తెలుపుతున్నారు. గత 20 రోజులుగా సమస్య నెలకొందంటున్నారు. ఇక గ్రామం నడిబొడ్డున తాగునీటి చేతి పంపు ఉందని, అది మరమ్మతులకు గురైందని, ఏళ్లు గడస్తున్నా దానిని ఎవరూ బాగు చేయలేదని అంటున్నారు. ఆ చేతిపంపు వినియోగంలో ఉన్నా.. సమస్య కొంతవరకు తీరేదని చెబుతున్నారు. చేసేదిలేక గ్రామ సమీపంలో ఉన్న రైతు తిమ్మరాజు వ్యవసాయ బోరునుంచి నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు సంబంధితాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించామని, అయితే ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిం చాలని గ్రామస్థులు ఆనంద్, గంగరాజు, రాజశేఖర్, సులోచన, లలితమ్మ, బయమ్మ, గంగులమ్మ, సరస్వతి, చంద్రకళ, నాగరత్నమ్మ తదితరులు కోరుతున్నారు.

పాఠశాలలో కొళాయిలు, పైపులు ధ్వంసం

ధర్మవరంరూరల్, జూన్13: మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో నీటికొళాయిలను, పైపులైన్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. గురువారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు గమనించి గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాఠశాలకు వెళ్లి వాటిని పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా కొళాయిలు, పైపుల మరమ్మతుల కోసం రూ.5వేల నగదును టీడీపీ నాయకులు వితరణ చేశారు. తాగునీటి కొళాయిలు, పైపుల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.





ధ్వంసమైన కొళాయిలు, పైపులైన్

క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం

ధర్మవరం, జూన్ 13: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైద్యఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఆయన డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మాన్ ఆధ్వర్యంలో వైద్యులు, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. జూలై 10వ తేదీ వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. నోటికి, రొమ్ముకు, గర్భాశయ ముఖద్వారానికి వచ్చే క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ ఎలా వస్తుంది, రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. పొగాకు, సిగరెట్, బీడీ ,గుట్కా తదితర వాటికి దూరంగా ఉంటే నోటి క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నివేదిత, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, వైద్యులు శైలజ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్

16న కూటమి ఆత్మీయ సమావేశం

కదిరి, జూన్ 13: ఈనెల 16వ తేదీన కూటమి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందికంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. తన గెలుపునకు కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. 16న ఉదయం 10.30 గంటలకు పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమావేశం ఉంటుందని, అనంతరం విందు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒకరుసమావేశానికి హాజరవ్వాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు డైమండ్ ఇర్షాన్, రాజశేఖర్‌బాబు, గంగయ్యనాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

పలు పాఠశాలల తనిఖీ

నల్లమాడ, జూన్ 13: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను, కస్తూరిబా పాఠశాలను డీఈఓ మీనాక్షి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూరిబా పాఠశాలలో ఉపాధ్యాయినులపై విధులు సక్రమంగా నిర్వహించలేదని ఆరోపణలు ఉండడంతో మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే ఉంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులకు చదువుచెప్పడంలో కానీ, భోజన మెనూలో కానీ పొరపాట్లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి, ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట ఎంఈఓలు వేమనారాయణ, సురేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.



జెడ్పీహైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈఓ

విత్తనశుద్ధి తప్పనిసరి

నంబులపూలకుంట, జూన్ 13: రైతులు విత్తనాలను శుద్ధి చేసి విత్తినట్లు అయితే చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలో పలువురు రైతులు చేపడుతున్న వేరుశనగ సాగును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిలో వేరుశనగ విత్తనాలకు మాంకోజెబ్ మందును 3గ్రాములు, ట్రైకోడెర్మవిరిడిని 8గ్రాములు కలపాలన్నారు. కాండంకుళ్లు, వేరుపురుగు ఆశించే పొల్లాలో కిలో విత్తనాలకి ఇమిడాక్లోపెడ్ 2 ఎంఎల్, క్లోరోపైడిపాస్ 4 ఎంఎల్‌ను కలిపి విత్తన సాగు చేయాలన్నారు. విత్తనాలను తొలుత క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి.. కొద్దిసేపు నీడలో ఆరబెట్టాలని, తర్వాత శిలీంద్రనాసినితో శుద్ధి చేసి ఆ తర్వాత విత్తాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీష, అగ్రికల్చర్ అసిస్టెంట్లు యుగంధర్, ధనలక్ష్మి, ఎంపీఈఓ హరి, రైతులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న ఏఓ తదితరులు

వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్

కదిరిఅర్బన్, జూన్ 13: కదిరి ఆర్టీసీ డిపోలో పనిచేస్తు న్న డ్రైవర్లు, కండెక్టర్లు, గ్యారేజీ సిబ్బందితో పాటు రిటైర్డ్ అయి న పలువురు ఉద్యోగులకు గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. సాధారణంగా విధు ల్లో ఉన్నవారు చాలామంది బీపీ, షుగర్‌తో బాధపడుతుంటారని, వారి ఆరోగ్య పరిరక్షణ లో భాగంగా భవిష్యత్తులో టీబీలాంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించినట్లు డిపో మేనేజర్ మైనొద్దీన్ తెలిపారు. ఈవ్యాక్సిన్ వలన ఎలాంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, జూన్ 13: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కంసల రామాంజనేయులు గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. అయితే గురువారం ఉదయం కుటుంబసభ్యులతో మాట్లాడుతూ.. ఛాతీలో నొప్పి రావడంతో ఉన్నఫలంగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. టీడీపీ నాయకులు వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య సురేఖ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



కంసల రామాంజనేయులు (ఫైల్)

టీడీపీ ఫ్లెక్సీని చించేసిన వైసీపీ మూకలు

- పోలీసులకు ఫిర్యాదు

కొత్తచెరువు, జూన్ 13: చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తలమర్ల గ్రామంలో టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కాగా వైసీపీ మూకలు జీర్ణించుకోలేక బుధవారం రాత్రి ఆ ఫ్లెక్సీని చించేశారు. దీనిపై గురువారం స్థాని క టీడీపీ నాయకులు సీఐ రాజారమేశ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు బోయసూరి, వెంకటరెడ్డి, చంద్రాయుడు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు ఓటమిని భరించుకోలేక ఇలాంటి చిల్లర పనులు చేయడం తగదన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు.



టీడీపీ ఫ్లెక్సీని చించేసిన వైసీపీ మూకలు

ఉగ్ర మూకలను ఉరి తీయాలి

ధర్మవరం, జూన్ 13: జమ్మూ-కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్తున్న హిందూ యాత్రికులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడిన ఉగ్రమూకలను అరెస్టు చేసి, బహిరంగంగా ఉరితీయాలంటూ వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధులు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు గురువారం పట్టణంలోని కాలేజీ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాకిస్థాన్ ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదులను వెంటనే అరెస్టు చేసి ఉరితీయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, అంజి, దూలెప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.



పాకిస్థాన్ ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించుకోండి



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌బాబు

పెనుకొండ టౌన్, జూన్ 13: బీసీజీ వ్యాక్సిన్‌ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌బాబు సూచించారు. గురువారం నియోజకవర్గంలోని పలు ఆరోగ్య ఉపకేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సోమందేపల్లి మండలం ఓబుళదేవరపల్లి తదితర పంచాయతీల్లో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలతో బీసీజీ వ్యాక్సిన్ టార్గెట్‌లపై ఆరాతీశారు. వారు మాట్లాడుతూ మూడు వారాల నుంచి బీసీజీ వ్యాక్సిన్ వేయడం ప్రారంభించామని ఈ వ్యాక్సిన్‌ని 60సంవత్సరాలు పైబడినవారికి వేస్తున్నామన్నారు. టీబీని నివారించేందుకే ఈ వ్యాక్సిన్ అన్నారు. డా.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలను తరలిస్తున్న దృశ్యం

అగళి, జూన్ 13: మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆయా పాఠశాలలకు నేరుగా వెళ్లి అప్పగిస్తున్నామన్నారు. వీటితోపాటు బ్యాగులు, బెల్టు, బూట్లు అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పంపిణీ చేయనున్నారు.

రొళ్ల: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. మండలానికి అవసరమైన 37,841 పాఠ్యపుస్తకాలకు సంబంధించి 13,124 పాఠ్యపుస్తకాల, నోటు పుస్తకాలు 21,072, బెల్టులు 2906 వచ్చాయని వాటిని ఆయా పాఠశాలలకు తరలించినట్లు ఆయన వివరించారు.

పొంచివున్న ప్రమాదం..!



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్

మడకశిర రూరల్, జూన్ 13: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద విద్యుత్ స్తంభానికి ఫీజ్ బాక్స్ అమర్చారు. రోడ్డు పక్కనే ఉండడంతో విద్యార్థులు ఈ దారి గుండానే వెళుతున్నారు. వర్షాకాలం కాలం కావడం ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరుగకముందే విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ఫీజ్ బాక్స్ మార్చాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే.. నడక కష్టం..

● పట్టించుకోని పాలకులు



రోడ్డుపై వర్షంనీరు చేరడంతో బురదమయంగా మారిన ఆల్విన్ కాలనీ రోడ్డు

పెనుకొండ టౌన్, జూన్ 13: తేలికపాటి వర్షం పడితే రోడ్లన్నీ జలమయమై నడవడానికి కూడా కష్టంగా మారిందని ఆల్విన్ కాలనీ వాసులు వాపోతున్నారు. పట్టణంలోని ఆల్విన్ కాలనీలో రహదారంతా మురుగు కుంటలా మారింది. కాలనీవాసులు మాట్లాడుతూ 2021 నవంబరు 22న వైసీపీ కౌన్సిలర్‌గా గెలిచిన నందినిరెడ్డి వైస్‌చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలనీలో ఏ సమస్యా పట్టించుకున్న పాపానపోలేదు. ఒక్కసారికూడా కాలనీలోకి వచ్చి మా సమస్యలు అడిగిన పాపానపోలేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి వర్షపునీరు రోడ్డుపై నిలువ ఉండకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం


● విత్తనసాగుకు అన్నదాత సమాయత్తం



విత్తనాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

మడకశిరటౌన్, జూన్ 13: మడకశిరలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వర్షం కురుస్తుండటంతో విత్తనాలు విత్తేందుకు రైతులు పొలంబాటపట్టారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తుండటంతో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఎమ్మెల్యేకి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్ తదితరులు

పావగడ, జూన్ 13: పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు నూతన ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్ బెంగళూరులోని ఎల్‌హెచ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. 5న ఆగ్నేయ ఉపాధ్యాయ క్షేత్రానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో డీటీ శ్రీనివాస్ తరుపున ఎమ్మెల్యే వెంకటేశ్, ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి తన గెలుపుకు కారణమైన పావగడ నియోజకవర్గాన్ని ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. అధికార పార్టీ హయాంలో పావగడకు తనవంతు సాయం అందిస్తానని శ్రీనివాస్ తెలిపారు.

పంటలకు జీవం..!

● జూన్ ప్రారంభం నుంచి మోస్తరు వర్షాలు
● పంటల సాగుకు అనుకూలం
● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

చిలమత్తూరు, జూన్ 13: వాన కోసం ఎదురు చూసిన రైతులు మురిసిపోతున్నారు. జూన్ ఆరంభం నుంచి పదునైన వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం నింపింది. నిలకడగా కురుస్తున్న వాన పంటలకు జీవం పోసింది. నీటి కోసం నింగివైపు చూసిన నేల తల్లి తడిసి ముద్దైంది. విత్తుకుంటున్న పంటలు జీవం పోసుకుంటున్నాయి. వర్షాకాలం సీజన్ మొదలయ్యాక 15 రోజులుగా ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతూనే ఉంది. ఖరీఫ్‌లో పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు కురుస్తున్న వర్షాలు పెద్ద ఊరటనే ఇస్తున్నాయి. ఇప్పుడు విత్తుకుంటున్న వేరుశనగ, జొన్న ఇతర పంటలకు ఈ నెల ఆరంభం నుంచి కురుస్తున్న వర్షం జీవం పోసినట్లయింది. గత ఏడాది ఇదే నెలలో వర్షాలు ప్రారంభమైనా రుతుపవనాలు దారి మళ్లడంతో తీవ్ర వర్షాభావం నెలకొంది. తొలకరి జల్లుల కోసం జూన్ నెలంతా నిరీక్షించాల్సి వచ్చింది. గత ఏడాది తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది భిన్నంగా భారీ వర్షాలతో రైతులను ఉత్తేజితులను చేస్తోంది.

చిరుజల్లులతో రైతుల్లో ఆనందం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వర్షాలు కూడా బాగా కురుస్తాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అందుకు తగ్గట్టుగానే మండల వ్యాప్తంగా ప్రతి రోజూ చిరుజల్లులు కురుస్తుండంటతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత ఏడాది వర్షాలు మొహం చాటేయడంతో చెరువుల్లో కూడా నీటిమట్టాలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. ఈ ఏడాది వేసవిలో అక్కడక్కడా తాగునీటి ఇక్కట్లు కూడా వచ్చాయి. ఈ ఖరీఫ్‌లో వర్షాలు మంచి ప్రారంభం ఇస్తుండటంతో రైతులకు మంచి జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. తాగునీటి కష్టాలు కూడా తీరే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అంటున్నారు.

ఎరువులకు పెరుగుతున్న గిరాకీ

ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటల సాగులో బిజీ అవుతున్నారు. పంటల సాగుకు ఎరువుల కొనుగోలుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం దుకాణాల్లో ఎరువుల కొరత నెలకొంది. రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన స్టాకు లేకపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటకకు రైతులు తరలిపోతున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో కేవలం యూరియా, డీఏపీ మాత్రమే లభించేవి. అవి కూడా తక్కువ నిల్వలతో ఉండేవి. దాంతో రైతులు ఎరువుల కోసం బయటికి వెళ్లక తప్పేది కాదు. ఈ కొత్త ప్రభుత్వంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంటాయని, దాంతో ఎరువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమస్య ఉండదని రైతులు అంటున్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం అర్బన్, జూన్ 13: హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆబాద్‌పేటలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ వైసీపీ అధికారంలో ఉండటంతో అప్పట్లో పలుమార్లు నిర్వహించిన ధర్నాలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. అప్పట్లో హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, మెడికల్ కళాశాలను పురంలోనే ఏర్పాటు చేయాలని అఖిలపక్షాలతో కలిసి నిరసనలో పాల్గొని మాట్లాడారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బాలయ్య హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మార్చేందుకు కృషి చేయాలని వారు కోరారు. బీఎస్పీ నాయకులు హరికుమార్, శిరివరం మూర్తి, ఎంఎల్ నారాయణ, మౌలాలి, ఖలందర్, బాబు, చిరంజీవి, నరసింహప్ప, సత్తెప్ప, అంజినప్ప, వెంకటరాముడు, గంగాధరప్ప పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.32.25 లక్షల ఆదాయం

లేపాక్షి, జూన్ 13: లేపాక్షి ఆయాలంలో వాహనాల వేలంపాటను గురువారం పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీ శివన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. 9 నెలల 18రోజులకు సంబంధించి నిర్వహించిన వేలంలో ఆరుగురు పాల్గొన్నారు. లేపాక్షి గ్రామానికి చెందిన సైపుల్లా రూ.32,25,000లకు వేలాన్ని దక్కించుకున్నారు. నిబంధనలకు లోబడి వాహనదారుల నుంచి రుసుం వసూలు చేయాలని అధికారులు సూచించారు.

సంత వేలం వాయిదా: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపుసంత వేలంపాట వాయిదా పడింది. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. అయితే పాటలో ఐదుగురు పాల్గొనగా ఎవరూ పంచాయతీ వారు ఆశించినంతగా వేలం పాడలేదు. ఈఓఆర్డీ శివన్న మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు రూ.3 లక్షలకు పైబడి వేలం పాట పాడితేనే సంత వేలం నిర్వహిస్తామన్నారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. తదుపరి వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం



ఆలయకమిటీ సభ్యులకు విరాళం అందచేస్తున్న దాతలు

గోరంట్ల, జూన్ 13: మండలంలోని వానవోలు గ్రామంలోని కస్తూరి రంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి ఇండ్లూరి వెంకటరమణనాయుడు రూ.50,116 విరాళం అందించారు. పురాతనమైన ఆలయాన్ని ప్రజలు పునఃనిర్మించాలని భావించి విరాళాలు సేకరిస్తున్నారు. ఓడీసీ మండలంలోని బొమ్మిరెడ్డిచెరువు గ్రామానికి చెందిన వెంకటరమణనాయుడు, లక్ష్మీదేవి దంపతులు గురువారం ఆలయాన్ని సందర్శించారు. వారు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు శ్రీధర్, బాలక్రిష్ణ, రంగప్ప, లింగప్పలకు విరాళం అందించారు.

అజ్జయ్యస్వామికి పూజలు



అలంకరణలో స్వామివారు

గుడిబండ, జూన్ 13: మండలంలోని తాళికెర గ్రామ సమీపంలో వెలసిన అజయ్యస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. గురువారం అజ్జయ్యస్వామికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి బొరుగులు, కారం నైవేద్యంగా ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజ్జయ్యస్వామిని దర్శించుకున్నారు.

గుడిబండలో వర్షం

గుడిబండ, జూన్ 13: మండలంలోని రాళ్లపల్లి, కొంకల్లు, ఎస్.రాయాపురం, ఎస్ఎస్ గుండ్లు, మేకలగట్ట తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు తమ పొలాల్లో వేరుశనగ విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఓ పదును వర్షం పడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి విత్తనాలు వేసేందుకు సిద్ధమైనట్లు రైతులు తెలిపారు.

రాజీనామా బాటలో స్టోర్ డీలర్లు



రాజీనామా పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేస్తున్న స్టోర్ డీలర్లు

పెనుకొండ టౌన్, జూన్ 13: వైసీపీ అధికారం కోల్పోవడంతో రాజీనామా బాటలో స్టోర్ డీలర్లు ఉన్నారు. గురువారం పెనుకొండ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన స్టోర్ డీలర్లు తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు రాజీనామాపత్రం అందించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరమఠం వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, జూన్ 13: పట్టణంలోని కోటలో ఉన్న శారద శంకర మఠం వార్షికోత్సవాన్ని గురువారం మఠం యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు లక్ష పుష్పార్చన, కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్యవైశ్య, బ్రాహ్మణ సంఘాల సంబరాలు

పెనుకొండ, జూన్ 13: పెనుకొండ ఎమ్మెల్యే సవితకు మంత్రివర్గంలో స్థానం లభించడంతో పెనుకొండలోని బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. గురువారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య సంఘం సమీపంలో బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో అరగంటపాటు సవిత ఐశ్వర్య ఆరోగ్యాలతో కలకాలం ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తూ వేదఘోష నిర్వహించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి సవితకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేశారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు శేషప్పస్వామి, నాగప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌కుమార్, కన్నాస్వామి, సీఎం శ్రీధర్ చంద్రశేఖర్, బక్సంపల్లి రామక్రిష్ణ, సుధాకర్ గుప్తా, యాడికి నాగరాజు, సుబ్రహ్మణ్యం, పులుగురు శీను, నంజుండ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కౌలు రైతు కష్టాల సేద్యం..!

● భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే పథకాలు
● మార్కెట్ ధరకు విత్తనకాయలు కొనలేకపోతున్నాం
● అందరికీ పథకాలు వర్తింపజేయాలంటున్న కౌలు రైతులు



వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులు

మడకశిర, జూన్ 13: అరెకరా భూమి లేకపోయినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి ఏడాది ఏదోవిధంగా పంటలు దెబ్బతిని కౌలు రైతులు దెబ్బతింటూనే ఉన్నారు. కౌలుకు భూములు రైతులు ఆ భూములకు అగ్రిమెంట్ చేసుకోకపోవడంతో వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సౌకర్యాలు అందడం లేదు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సురెన్స్ అందడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో 186 మంది రైతులు కౌలుకు భూములు తీసుకుని అగ్రిమెంట్ చేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. నియోజకవర్గంలో కొంతమంది రైతులు కౌలుకు భూమలు తీసుకున్నా అగ్రిమెంట్ చేసుకోకుండా పంటలు వేస్తున్నారు. కౌలు రైతులు పంటలు నష్టపోతే ఏ పథకమూ వీరికి వర్తించడం లేదు. దీంతో పంటలు పండక, చేసిన అప్పులు తీర్చలేక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు.

పంట సాగుకు అప్పు చేయాల్సిందే..

పంట సాగుకు ప్రతి ఏడాది అప్పులు చేయాల్సిందేనని రైతులు వాపోతున్నారు. తీరా పంట సాగుచేస్తే అతివృష్టి, అనావృష్టితో ప్రతి ఏడాది నష్టపోతున్నామని కౌలు రైతులు అంటున్నారు. ఒకవేళ పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధర లభించదని రైతులు అంటున్నారు. గత ఏడాది వర్షాలు పడక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కౌలు రైతులకు అగ్రిమెంట్‌తో సంబంధం లేకుండా పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలని కోరుతున్నారు.

ఐదేళ్లుగా నష్టపోతున్నాం:
ఫక్రుద్దీన్, కౌలు రైతు, మడకశిర



తనకు సెంటు భూమి కూడా లేదు. వ్యవసాయంపై ఉన్న మక్కువతో రెండెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పంటను సాగుచేశా. అతివృష్టి, అనావృష్టి కారణంగా సాగుచేసిన వేరుశనగ పంట దెబ్బతిని పూర్తిగా నష్టపోయా. గత ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట మొత్తం ఎండిపోయింది. దీంతో మధ్యలోనే పంటను తొలగించా. ఈ ఖరీఫ్‌లో కూడా పంట పెట్టేందుకు మార్కెట్‌లో వేరుశనగ విత్తనకాయలు క్వింటాలుకు రూ.7500 ఖర్చు చేశా. పంట సాగుకు పెట్టుబడి పెరిగిపోయింది. అగ్రిమెంట్‌లేని కారణంగా ప్రభుత్వం అందించే పథకాలు రావడం లేదు. ఈ ఏడాది వర్షాలు కురుస్తుండడంతో అప్పులు చేసి వేరుశనగ పంటను సాగు చేస్తున్నా. ఈ ఏడాదైనా పంటలు బాగా పండి అప్పులు కొంతవరకైనా తీరాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నా.

జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు, సంఘం సభ్యులు

హిందూపురం అర్బన్, జూన్ 13: జిల్లాస్థాయి బాలికల జూనియర్స్, సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ జట్లను గురువారం ఎంపిక చేశారు. పట్టణ పరిధిలోని ఎంజీఎం క్రీడామైదానంలో జిల్లా నలుమూలల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారిణులు వచ్చారు. వీరిలో జూనియర్స్ విభాగంలో ప్రతిభ చాటిన 20 మందిని, సబ్ జూనియర్స్‌లో ప్రతిభ కనబరిచిన 20 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహ్మద్‌సలీం, ఈసీ మెంబర్ విజయవాణి, సభ్యులు అజాద్, శ్రీనివాసరెడ్డి, అశ్వత్థనారాయణ, పీడీ లోకనాథ్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ



స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డీవైఈఓ రంగస్వామి

గోరంట్ల, జూన్ 13: స్థానిక ఎమ్మార్సీ వద్దనున్న విద్యాశాఖ కార్యాలయ స్టాక్ పాయింట్‌ను పెనుకొండ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రంగస్వామి గురువారం తనిఖీచేశారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభించారు. మొదటి విడతగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకోసం స్టాక్ పాయింట్‌కు మంజూరైన కిట్లను పాఠశాలలకు అధికారులు సరఫరా చేస్తున్నారు. విద్యార్థుల కిట్లను సక్రమంగా సరఫరా చేసి, విద్యార్థులకు అందేలా చూడాలని ఎంఈఓ గోపాల్‌ను ఆదేశించారు. స్టాక్‌పాయింట్‌తోపాటు ఎంఈఓ కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు సీఆర్‌ఎంటీలు, పీటీఐలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి అస్వస్థత

గోరంట్ల, జూన్ 13: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన కరీముల్లా గురువారం విద్యుత్ షాక్ తగిలి అస్వస్థతకు లోనయ్యారు. మహబూబ్‌బాషా కుమారుడైన కరీముల్లా తన నివాసంలో విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో పరిశీలిస్తుండగా షాక్ తగిలింది. వెంటనే కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ఉషా చికిత్సలు జరిపారు. మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తి ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

మూడు రోజులుగా ఆసుపత్రి గేటు వద్దే...



ఆసుపత్రి గేటు వద్ద పడుకుని ఉన్న వృద్ధుడు

హిందూపురం అర్బన్, జూన్ 13: మూడు రోజులుగా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి గేటు పక్కనే ఉన్న పార్కులో వృద్ధుడు పడి ఉన్నాడు. గాలికి, వర్షానికి, చలికి అవస్థలు పడుతూ అక్కడే ఉన్నాడు. అతను పట్టణ పరిధిలోని రహమత్‌పురానికి చెందిన జవుల్లాగా గుర్తించారు. అటు కుటుంబ సభ్యులు కానీ, ఆసుపత్రి వర్గాలు కానీ ఎవరూ పట్టించుకోలేదని అతని అవస్థలు చూసిన పలువురు చర్చించుకుంటున్నారు. ఎవరైనా స్పందించి అతనికి సహాయం అందించాలని కోరుతున్నారు. కనీసం స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందిస్తే ఆయన్ను ఆదుకుంటారని ఆసుపత్రికి వచ్చిన వారు మాట్లాడుకుంటున్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి: ఎస్పీ

ముదిగుబ్బ, జూన్13: గ్రామాల్లో గొడవలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం ఉండే విధంగా చూడాలని, శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ముదిగుబ్బ అప్‌గ్రేడ్, పట్నం పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ లాకప్ గదులను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై సమీక్షించారు. రికార్డులను పరిశీలించి కేసు వివరాలపై స్థానిక ఎస్‌ఐలను ఆరా తీశారు. గ్రామాల్లో ప్రశాంతత లోపించకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లపై దృష్టి సారించి, వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళలలో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ సీఐ యతీంద్ర, పట్నం ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

నంబులపూలకుంట, జూన్ 13: రైతులు విత్తనాల ను శుద్ధి చేసి విత్తినట్లయితే చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలో పలువురు రైతులు చేపడుతున్న వేరుశనగ సాగును గురువారం ఆ యన పరిశీలించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ కిలో వేరుశనగ విత్తనాలకు మాంకోజెట్ మందును 3గ్రాములు. ట్రైకోడెర్మవిరిడిని 8గ్రాములు కలపాలన్నారు. కాండంకుళ్లు, వేరుపురుగు ఆశించే పొలాల్లో కిలో విత్తనాలకి ఇమిడాక్లోఫెడ్ 2 ఎంఎల్, క్లోరోఫైడిపాస్ 4 ఎంఎల్‌ను కలిపి విత్తన సాగు చేయాలన్నారు. విత్తనాలను తొలుత క్రిమిసంహారక మం దుతో శుద్ధి చేసి.. కొద్దిసేపు నీడలో ఆరబెట్టాలని, తర్వాత శిలీంద్రనాసినితో శు ద్ధి చేసి ఆ తర్వాత విత్తాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీష, అగ్రికల్చ ర్ అసిస్టెంట్లు యుగంధర్, ధనలక్ష్మి, ఎంపీఈఓ హరి, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హరీష్

కదిరిఅర్బన్, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏపీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొత్తకోట హరీష్ నియమితులయ్యారు. అనంతపురంలో బుధవారం జరిగిన ఏపీఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా బండి శివను నియమించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర నుంచి ఈ మేరకు నియామక పత్రం అందుకున్నట్లు హరీష్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉగ్రమూకలను ఉరి తీయాలి

ధర్మవరం, జూన్ 13: జమ్మూ-కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్తున్న హిందూ యాత్రికులపై నిర్ధాక్షిణ్యంగా కాల్పులకు తెగబడిన పాకిస్థాన్ ఉగ్రమూకలను అరెస్టు చేసి బహిరంగంగా ఉరితీయాలంటూ వీహెచ్‌పీ, బజరంగదళ్ ప్రతినిధులు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు గురువారం పట్టణంలోని కాలేజీ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాకిస్థాన్ ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదులను వెంటనే అరెస్టు చేసి ఉరితీయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, అంజి, దూలెప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కందులు

నల్లమాడ, జూన్ 13: ఖరీఫ్‌లో కంది సాగుచేసే రైతులకు మండలవ్యాప్తంగా ఉన్న ఆర్బీకేలలో విత్తన కందులు అందుబాటులో ఉన్నట్లు ఏఓ సుమతి తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. 4కేజీల కందుల బ్యాగును సబ్సిడీతో రూ.391.44కు అందిస్తున్నామన్నారు. అవసరమున్న రైతులు ఆర్బీకేలలో తీసుకోవాలని సూచించారు.